మినికథ :

# పాడుబుద్ధి

"నౌణ్ రావ్!"

" "

"మిష్ట్ర నాణ్రావ్!"

" "

ఖంగుఖంగుమన్న ఆఫీసరు పిలుపులకి "యస్సార్!" అన్లేదు నారాయణ్రావు. సింపుల్‌గా లేచి, తాపీగా నడిచివెళ్ళి, ఆఫీసరు ముందు నిలబడి, చేతులేనా కట్టుకోకుండా, తలకాయేనా వంచకుండా- ఆఫీసరుకేసి విలన్‌లా చూసి, 'ఏవిఁటి కత?' అన్నట్టుగా నిలబడ్డాడు.

"వాటీజ్ దిస్ నాన్సెన్స్?" టైప్ కాగితాలు చూపించి ఆఫీసరు అన్నాడు.

"ఏ నాన్సెన్స్?" అన్నట్టు చూసేడు నాణ్రావ్ మాట్టాడకండా.

అవి నాణ్రావ్ టైప్‌చేసిన కాగితాలు. వాటినిండా రైట్లుకన్నా రాంగులెక్కువున్నాయి. అవి టైప్‌చేసినప్పుడు బద్ధకంగానూ, నిద్దరమొహంతోనూ వున్నాడు నాణ్రావు. ఎంచేతంటే నిన్న రాత్రి రౌండోఆట యింగ్లీషిన్మా చూసేడు. అవి యింపార్టెంటు కాగితాలవ్వడంచేత ఆఫీసరుకి తిక్కరేగింది. అంచేత ఆ కాగితాల్ని పరపరా చింపేసి విసిరికొట్టేసి, నాణ్రావ్‌ని యింగ్లీషులో చెడామడా తిట్టేసేడు పావుగంటసేపు. అంత అశ్రద్ధ పనికిరాదన్నాడు. ఇంగ్లీషు నేర్చుకో అన్నాడు. ఒళ్ళు దగ్గరుంచుకో అన్నాడు. బుద్ధిగా పన్జేసుకో అన్నాడు. పో అన్నాడు. ఈ మాటలు ఆఫీసులో అందరూ వినేసేరు. నాణ్రావ్ దెబ్బతినేసేడు. విసురుగా ఒచ్చి సీట్లో కూచుని, తన కోపాన్నంతా టైప్మెషన్మీద చూపించి, టపాటపా మళ్ళీ టైప్‌చేసేసి ఆఫీసరు ముందు పారేసేడు.

ఆనక నాణ్రావు ఆఫీసరుమీద బోల్డు కోపం పెట్టేసుకున్నాడు. "ఎంత ఆఫీసరైతే మాత్రం? అంత పోజేస్తాడా? ఏం, నేనూ మనిషినేనా? సాటి ఉద్యోగినేనా? మరి తోటి ఉద్యోగిమీద పిసరంత ప్రేముండొద్దూ? కాస్త మర్యాదిచ్చి పుచ్చుకుంటే చచ్చిపోడు కదా?" అని మనసులో ఉడుక్కున్నాడు.

ఆనక ఆఫీసొదిలేసేక ఆఫీసరూ బోల్డు బాధపడ్డాడు నాణ్రావ్ గురించి. పాపం అతనూ చీవూఁ నెత్తురూ ఉన్న మనిషే కదా? ఆ మాటకొస్తే మనం మన బతుకుల్ని యిళ్ళల్లోకంటే ఆఫీసుల్లోనే ఎక్కువ భాగం గడిపేస్తావేం! మరలాంటప్పుడు ఆఫీసుని కూడా ఓ కుటుంబంగా ఎందుకు భావించుకోం? తోటి వాళ్ళమీద ఓ కాస్త ప్రేమ, మర్యాదా చూపిస్తే మన పరువేం తగ్గిపోదే! అని నిజంగా బాధపడ్డాడు."

అందుకే ఆ మర్నాడు రెండు స్ట్రాంగ్ కాఫీలు తెప్పించి, నాణ్రావుకి పిలుపెట్టి, "కూచో!" "తీసుకో!" అన్నాడు నవ్వి. "నిన్న జరిగింది మనసులో పెట్టుకోకు.ఏదో కోపంలో అంటూంటాం. అంతే. అవన్నీ పట్టించుకోకూడ్దు" అన్నాడు ప్రేమగా.

"కాకా పట్టేస్తున్నాడు గురుడు! వాయ్? అందితే జుట్టూ, లేపోతే కాళ్ళూనూ. ఔను మరి! అంతకంటే ఏం చేస్తాడు పాపం? నాతో దెబ్బలాడితే తనకి పనెలా జరుగుతుంది పాపం?" అనుకున్నాడప్పుడు నాణ్రావ్—జాలిగా క్షమించేను పో అన్నట్టుగా.

—ఎల్బీ. శ్రీరామ్